RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## ఈనెల 8న జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రిపోర్ట్ చేయాలి.

కర్నూల్ కర్నూలు జిల్లా షూటింగ్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు ఈనెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు కర్నూలు రైల్వే స్టేషన్లో రిపోర్ట్ చేయగలరు. ఎంపికైన బాలుర జట్టు అంజి నాయక్, మధు, దివాకర్( సాంఘిక సంక్షేమ పాఠశాల, సి.బెలగల్)సృజన్ పాల్, అజయ్ ( గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కర్నూలు) సచిన్ ,మధు (ఆదర్శ విద్యా మందిర్ ,కర్నూల్) రాజేష్ (చిన్మయి విద్యాలయం) మహేష్ )గిరిజన ఆశ్రమ పాఠశాల) రాహుల్ (భవిత విద్యాలయం) జట్టు కోచ్ మల్లికార్జున. బాలికల జట్టు: లక్ష్మి ,రాణి , మహేశ్వరి (సాంఘిక సంక్షేమ పాఠశాల, పత్తికొండ) శిరీష, తులసి, సౌజన్య ( కంబాలపాడు) రాణి, (ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎమ్మిగనూరు) మౌనిక, లక్ష్మీరాజ్యం ,(ఆదోని) ప్రీతి, సోనాలి ,(కోడుమూరు) రాజేశ్వరి (కర్నూలు) కోచ్ గీత. జిల్లా జట్టుకి ఎంపికైన వీరు 8వ తేదీ సాయంత్రం కోచ్ మల్లికార్జున వద్ద రిపోర్టు చేయగలరని జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిటి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. ప్రజాజీవనంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 90 ఆదివారం 04-08-2024 పేజీలు :04 వెల:రూ.2.00

# ఆ అధికారులను వదిలిపెట్టను..



### ఏపీ సీఎం చంద్రబాబు వార్నింగ్

అమరావతి :- గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖను నిర్వీర్యం చేశారని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. మదనపల్లె ఘటనే రెవెన్యూ శాఖ నిర్వీర్యానికి ఉదాహరణ అని తెలిపారు. నిర్వీర్యమైన వ్యవస్థలను 100 రోజుల్లో గాడిన పెడతామని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు అందాయని తెలిపారు. వినతులు అన్నింటినీ పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి మండలంలోనూ ఓ భూకుంభకోణం వెలుగు చూస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. రికార్డులను కూడా తారుమారు చేశారని పేర్కొన్నారు. రీసర్వే అస్తవ్యస్తంగా జరగడం వల్లే ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో రెవెన్యూ సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రాధాన్యమిస్తామని చంద్రబాబు తెలిపారు. రెవెన్యూ సమస్యలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను వదిలేది లేదని హెచ్చరించారు.భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు. సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కరిస్తామని చెప్పారు. వినతులు ఇచ్చేందుకు అమరావతి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నియోజకవర్గాలు, జిల్లాల్లో ఫిర్యాదులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. తన పర్యటనల వల్ల ఎవరూ ఇబ్బంది పడకుండా మార్పులు తెస్తామని అన్నారు.

# టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు

### అర్జీలు సమర్పించేందుకు భారీగా జనం రాక





అమరావతి,ఆగస్ట్3 : ప్రజా సమస్యలను వినేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు శనివారం ఉదయం టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజల వద్ద నుంచి వినతి పత్రాలు, పార్టీ శ్రేణుల నుంచి అర్జీలను సీఎం స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎంను కలిసి వినతి పత్రాలు సమర్పించేందుకు పార్టీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. ముందుగా దివ్యాంగుల నుంచి వినతి పత్రాలను స్వీకరించి చంద్రబాబు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరి సమస్యలు పరిష్కరిస్తామని వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కాగా.. టీడీపీ శ్రేణులు గడిచిన 50 రోజులుగా 10 వేలకుపైగా అర్జీలు తీసుకున్నారు. కాగా... గత నెల జూలై 17 నుంచి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమం మొదలైంది. ప్రతీరోజు ఏపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, తెలుగుదేశం నేతలు ప్రజా సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేశారు. ఈమేరకు టీడీపీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పార్టీ కార్యాలయంలో తప్పనిసరిగా మంత్రులు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ శ్రేణుల, ప్రజల కోసం కేంద్ర కార్యాలయంలో మంత్రులు అందుబాటులో ఉండనున్నారు. 10 రోజులు పాటు రోజుకో మంత్రి , ఒక సీనియర్ టీడీపీ నేత అందుబాటులో ఉండే విధంగా అధిష్ఠానం కార్యాచరణ రూపొందించిన విషయం తెలిసిందే.

# సహకార వ్యవస్థలో ఈ-కేవైసీ అమలు



### పారదర్శకంగా సేవల అమలుకు కృషి
### కౌలురైతు చట్టం రద్దు చేసి.. త్వరలో కొత్త చట్టం
### సహకార సంఘాల్లో సభ్యులుగా కౌలు రైతులకు చోటు
### ఆప్కాబ్ రాష్ట్రస్థాయి సమావేశంలో మంత్రి అచ్చన్నాయుడు



విజయవాడ,ఆగస్ట్3: సహకార వ్యవస్థలో ఈ-కేవైసీ అమలు చేసి పారదర్శకంగా సేవలు అందిస్తామని వ్యవసాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతు చట్టం రద్దు చేసి, త్వరలో కొత్త చట్టం తీసుకొస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని విధాలా సేవలు అందించి, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు.విజయవాడలో శనివారం నిర్వహించిన ఆప్కాబ్ రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశానికి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలురైతు చట్టం రద్దు చేసి.. త్వరలో కొత్త చట్టం తెస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి కౌలు రైతుకు న్యాయం జరగాలని తెలిపారు. కౌలు రైతులను సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చి రుణాలు ఇస్తామని అన్నారు. నేటి నుంచే వ్యవస్థలో మార్పు రావాలి.. లోపాలు సరిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సహకార సంఘాల్లో అవినీతి జరిగిందని వస్తున్న వార్తలపై విచారణ చేయిస్తామని హెచ్చరించారు. ఆప్కాబ్ వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తా రని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వానికైనా, ప్రజలకైనా వ్యవసాయం మరియు సహకార సంఘాలు అత్యంత ప్రాధాన్యమైనవి అన్నారు. ఈ రంగాలు లేని సమాజాన్ని కూడా ఊహించలేమన్నారు. 2019లో తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి 2016లో చేసిన చట్టాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. భూ యజమాని అంగీకారం ఉంటేనే కార్డు ఇవ్వాలని మెలిక పెట్టడంతో, గతంలో వచ్చిన ప్రయోజనాలు కూడా అందక రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రతి కౌలు రైతుకు బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సహకార వ్యవస్థలో ఈ-కేవైసీ అమలు చేసి పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కౌలు రైతులను సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చి రుణాలు అందించాలని, చిట్టచివరి కౌలు రైతుకు కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాలను తీర్చిదిద్దాలని, నూతన సంస్కరణలతో రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సొంత రైతులే వ్యవసాయాన్ని వదిలేస్తున్న నేపథ్యంలో, సాగు బాధ్యతను కౌలు రైతులే తీసుకుంటున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో 90 శాతానికిపైగా కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారన్నారు. సీసీఆర్సీ పేరిట అనాలోచిత చట్టాన్ని తెచ్చి అన్నదాతలను గత ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. సీసీఆర్సీ కార్డులు రాక, ప్రభుత్వ ప్రయోజనాలు అందక, రైతులు కష్టాల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం రాకతో రైతాంగానికి మళ్లీ మంచిరోజులు రావాలని, వ్యవసాయానికి ఊతమిచ్చేలా సహకార వ్యవస్థ పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. కౌలు రైతులకు రుణాలు సులభంగా అందే పరిస్థితి రావాలని, ఇప్పటికే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కూడా రైతులను చుట్టుముట్టడటంతో చేతికొచ్చిన పంట పాడవుతోందని, రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించినా రాబడి లేక అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నాడన్నారు. కాకుండా పేదరికంలో ఉన్న నిజమైన రైతులకు రుణాలు ఇవ్వాలని, డిజిటైలేజేషన్ తో అక్రమాలకు తావులేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సహకార సంఘాల్లో అవినీతి జరిగిందని వస్తున్న వార్తలపై విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రతి రైతు భూమిని వెబ్ ల్యాండ్లో పెట్టి గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# కొవ్వాడ ఎర్ర కాలువలను ఆధునీకరణ

### కేంద్ర నిధులకోసం ప్రయత్నిస్తా
### ఎంపి పురంధేశ్వరి వెల్లడి

రాజమండ్రి,ఆగస్ట్3: కొవ్వాడ ఎర్ర కాలువలను ఆధునికీకరించడానికి అవసరమైతే కేంద్ర నిధులను తీసుకుని వస్తానని.. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, తాడిపూడి కాలువ వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాలువల వల్ల రైతులు ఇబ్బంది పడకుండా శాశ్వత పరిష్కారం కోసం చూస్తున్నామన్నారు. ప్రస్తుత సీజన్లో తుఫాను అధిక వర్షాల ప్రభావంతో 2300 ఎకరాలు ముంపునకు గురయ్యాయన్నారు. ప్రతి సంవత్సరం తుఫాన్ వల్ల 5000 ఎకరాలు రైతులు నష్టపోతున్నారని పురందేశ్వరి పేర్కొన్నారు. పంట నష్టం వివరాలను అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. రైతులు నష్టపోకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనే పథకాలు తీసుకొచ్చారని పురందేశ్వరి అన్నారు. రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేసే విధంగా కేంద్రం ఫసల్ బీమా యోజన, కిసాన్ సమ్మాన్ పథకాలు తీసుకొచ్చారన్నారు. రైతులను ఆదుకునేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ముందుంటుందన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం రైతులను ఆదుకునే విధంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోనూ కేంద్రంలోని రెండు చోట్ల ఎన్డీఏ ప్రభుత్వం ఉందని.. రైతుల ఆదుకునే విధంగా పనిచేస్తోంద ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు.



# రౌడీ మూకల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ప్రభుత్వానికి మాజీమంత్రి డొక్కా హెచ్చరిక

అమరావతి,ఆగస్ట్3 : నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఆరు నెలలైనా సమయం ఇవ్వాలని... అయితే ఆ సమయం ఇవ్వకుండా కల్కి సినిమాలో కమాండర్ చేసినట్టు వైకాపా నేతలు కుట్రలు పన్నుతున్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాంప్లెక్స్లో కూర్చుని ఆ కుట్రలు చేస్తోంది సజ్జల రామకృష్ణారెడ్డి అని అన్నారు.రాష్ట్రంలో ఉన్న రౌడీలను అక్కడికి పిలిచి అరాచకాలు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో నూతన ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ రౌడీలపైన ప్రభుత్వం కన్నేసి ఉంచాలన్నారు. గతంలో ఎక్కడ శవం దొరికిన అది మాదే అని పరామర్శకు వెళ్లేవారు ఇప్పుడు ఎక్కడ మర్డర్ జరిగిన దానికికారణం టీడీపీ అంటూ వారిపై నెట్టేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మద్యం అమ్మకాల్లో లక్ష కోట్ల అవినీతి జరిగిందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యుల నుండి ఆ సొమ్మును రికవరీ చేయాలని కోరారు. మద్యం తాగి ఆరోగ్యాన్ని చెడగొట్టుకున్న కేసులు గత ఐదేళ్లలో భారీ సంఖ్యలో ఉన్నాయన్నారు. వారంతా జే బ్రార్ మద్యం తాగి లివర్లు చెడిపోయి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

# టిడిపిలో కానికి కాకుండా పోతున్నా



### వైకాపాకు ఎదురొడ్డి నిలిచినా పట్టించుకోవడంలేదు
### టిక్కెట్ ఇవ్వకున్నా పార్టీకోసం నిలబడ్డా
### ఎంపి కేశినేని చిన్ని ముందు బుద్దా వెంకన్న ఆవేదన

విజయవాడ,ఆగస్ట్3: టీడీపీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సంచలన కామెంట్స్ చేశారు. ఎంపీ కేశినేని చిన్ని జన్మదిన వేడుకలు తన ఆఫీస్లో నిర్వహించిన ఆయన... తనకు అండగా ఉంటాలంటూ విజయవాడ ఎంపీకి రిక్వస్ట్ చేశారు. తన మాట చెల్లుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కొన్న వారిలో తాను ముందు వరసలో ఉంటానని చెప్పుకొచ్చారు బుద్దావెంకన్న. అయితే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవి లేకపోవడంతో తన మాట చెల్లుబాటు కావడం లేదని అభిప్రాయపడ్డారు. నమ్ముకున్న వారికి ఏమీ చేయలేక పోతున్నానని అన్నారు. రాష్ట్రంలో సీఐల ట్రాన్స్ఫర్స్ విషయంలో ఎమ్మెల్యేల మాట నెగ్గిందని బుద్ద వెంకన్న ఆరోపించారు. ఎమ్మెల్యే ఎవరిని అడిగితే వారిని సీఐలుగా నియమించారని అన్నారు. ఈ విషయంలో తన మాట చెల్లుబాటు కాలేదని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు తన మాట ఎక్కడా చెల్లుబాటు కావడం లేదని తనే ఇతరులపై ఆధారపడి పనులు చేయించుకోవాల్సి వస్తుందని అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు ఏం చేయలేనని క్షమించాలని వేడుకున్నారు. 2024 ఎన్నికల సందర్భంలో రక్తంతో చంద్రబాబు నాయుడు చిత్ర పటం కాళ్ళు కడిగానని వెంకన్న గుర్తు చేశారు. తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోయినా బాధపడలేదన్నారు. చంద్రబాబు ఇంటి మీదకు జోగి రమేష్ వెళ్తే అడ్డంగా నిలబడ్డానని ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేలు అప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించా రు. కష్టకాలంలో ఉన్నప్పుడు వచ్చిందె వరో చెప్పాలన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అనేక పోరాటాలు చేశానని తెలిపారు వెంకన్న. వల్లభనేని వంశీ, కొడాలి నాని, పేర్ని నాని, విజయ్ సాయి రెడ్డి వ్యాఖ్యలను దీటుగా ఖండిస్తూ వచ్చానని చెప్పుకొచ్చారు. దీని వల్ల తనపై మొత్తం 37 కేసులు నమోదైనట్టు వెల్లడించారు. ఆ కేసులన్నీ టిడిపి కోసం చేసిన పోరాటంలో పెట్టినవేనన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు న్యాయం జరగలేద న్నారు. ఈ మాట ఆవేదనతోనే చెబుతున్న తప్ప వ్యతిరేకతతో కాదని తెలిపారు. గత ఎన్నికల్లో ఎంతో మంది పోరాటం చేసి, ఎదురు తిరిగి టిడిపిలో టికెట్లు పొందారని వెంకన్న వివరించారు.

# సంపాదకీయం

ప్రస్థానం
ఆదివారం 04-08-2024

## సెకండ్ ఒపీనియన్ పై మొదలైన చర్చ

అది ప్రాణాంతక వ్యాధి అని డాక్టర్ నిర్ధారించినపుడు, దాని నివారణకు దీర్ఘకాల చికిత్స, సర్జరీయే శరణ్యమని రిపోర్టులు చెబుతున్నపుడు ఎవరైనా బెంబేలుపడిపోతారు.ఆ అగమ్య పరిస్థితిలో ఎవరికైనా అందరూ సూచించేది ఒకటే 'మరో డాక్టర్ వద్దకు వెళ్లి సెకండ్ ఒపీనియన్ తీసుకోండి' అని. అదే చివరి ఆశ మరి. ఒక వైద్యుడి రోగ నిర్ధారణపై చికిత్సకు వెళ్లే ముందు మరో వైద్యుడిని సంప్రదించి 'ఇది నిజమేనా' అని తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైనది. ఆ తర్వాతే చివరి నిర్ణయం తీసుకోవాలి. సెకండ్ ఒపీనియన్ వల్ల చాలా విషయాలపై స్పష్టత వస్తుంది. ఒక్కోసారి రోగ నిర్ధారణలో అనుకోని లోటుపాట్లు జరగవచ్చు. ఎవరిని తప్పుపట్టకున్నా మొదటి డాక్టర్ చెప్పిన ఇబ్బందులు తప్పే అవకాశం కూడా ఉంది. సర్జరీకి బదులు మందులతో చికిత్స సరిపోవచ్చు. సర్జరీ విధానం మారవచ్చు.చికిత్సా విధానంలో వచ్చిన ఆధునిక పద్ధతులను తెలుసుకోవచ్చు. డబ్బులకు కటకట ఉన్నవారు తక్కువలో మంచి వైద్యం అందించే సంస్థల గురించి తెలుసుకోవచ్చు.ఏ ఇద్దరి వైద్యుల ట్రీట్‌మెంట్ ఒక్కలా ఉండదు. విషయ పరిజ్ఞానంలోనూ తేడాలుంటాయి. కాబట్టి సెకండ్ ఒపీనియన్ వల్ల ఉపశమనం పొందినవారు కూడా ఉంటారు. అయితే సెకండ్ ఒపీనియన్ కోసం ఎవరి దగ్గరికి వెళ్ళాలి అనేది అసలు సమస్య. గ్రామాల్లో ఉన్నవారు పట్టణ డాక్టర్ వద్దకు వస్తారు. పట్టణవాసులు నగరానికి వచ్చి తేల్చుకుంటారు. హైదరాబాద్ లాంటి నగరాల్లో సూపర్ స్పెషాలిటీ దవాఖానాలున్నాయి. వాటిలో అన్ని రకాల స్పెషలిస్టులు ఉన్నారు. వారే రోగ నిర్ధారణ చేశాక సెకండ్ ఒపీనియన్ కోసం ఎవరిని సంప్రదించాలి అనేది నగరవాసులకు అర్థం కాని విషయమే. అయితే ఈ సేవల కోసం అమెరికా లాంటి దేశాల్లోని వైద్య సంస్థలు ముందుకు వస్తున్నాయి. ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా ఆన్‌లైన్ ద్వారా రిపోర్టులు పంపించి డాక్టర్లను ఫోన్లో సంప్రదించి సెకండ్ ఒపీనియన్ పొందవచ్చు. క్యాన్సర్, హృద్రోగం, అవయవాల మార్పిడి లాంటి తీవ్రత గల వైద్య చికిత్సలకు ఆధునిక విధానాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం.సెకండ్ ఒపీనియన్ ఇవ్వడమే కాకుండా ఇండియాలో చికిత్స చేయించుకునే వారికి వైద్యపరంగా సాయపడుతున్నారు.దూరం నుంచే వీడియో ద్వారా వైద్య సూచనలు, చికిత్సలో సహాయం ఇక్కడి డాక్టర్లకు అందించేందుకు కూడా అక్కడి వైద్య నిపుణులు సిద్ధపడుతున్నారు. దీనికి తగిన డాలర్లు చెల్లించే స్తోమత ఉన్నవారు ఈ సేవలు పొందవచ్చు. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో మన దేశంలో కన్నా వ్యాధులపై, వైద్య విధానాలపై పరిశోధన సమృద్ధిగా జరుగుతోంది. ఫార్మసీ లాబ్స్‌ల్లో కొత్త రకం, మేలైన మందుల సృష్టికి కృషి చేస్తున్నారు. అరుదైన వ్యాధుల కోసం రూ. కోట్ల ఖరీదైన మందుల కోసం ప్రపంచం అగ్రదేశాల వైపు చూస్తోంది. అక్కడి ఆరోగ్య పత్రికలు అన్ని దేశాల వైద్యులకు మార్గదర్శకాలుగా పని చేస్తున్నాయి. రెండు వందల ఏళ్ల చరిత్ర గల 'లాన్సెట్' మెడికల్ జర్నల్ ఇంగ్లాండ్ నుంచి వస్తోంది. కోవిడ్ సమయంలో డాక్టర్లకు ఎప్పటికప్పుడు కొత్త సమాచారాన్ని అందించిన దీని సేవలు ఎంతో గొప్పవి. అంతటి వైద్య పరిజ్ఞానం గల డాక్టర్ల సెకండ్ ఒపీనియన్ లభిస్తే అంతకన్నా మేలు మరోటి ఉండదు. విదేశాల్లో సెకండ్ ఒపీనియన్ అందించే సంస్థలు ఎన్ని ఉన్నా వాటి చార్జీలు వందల, వేల డాలర్లలో ఉన్నాయి.ఈ మధ్య అమెరికాలోని ఇండియన్ డాక్టర్లు ఇండియాలో ఉన్న పేషెంట్లకు టెలీ మెడిసిన్ సేవలు అందించేందుకు 'మై అమెరికన్ డాక్టర్' అనే సంస్థను ప్రారంభించారు. అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న 50 మందికి పైగా స్పెషలిస్టులు ఈ ఆరోగ్య సేవలు భారతీయులకు అందిస్తారు. దీని కోసం 149 డాలర్లు చెల్లించాలి. ఆ తర్వాతి సంప్రదింపులకు అందులో సగం కడితే చాలు. డాక్టర్‌ను వర్చువల్‌గా కలిసాక 72 గంటల్లో అన్ని రిపోర్టులు అందజేస్తామని దాని సిఇఒ రాజ్‌నార్ల తెలియజేస్తున్నారు. వీరి వద్ద సెకండ్ ఒపీనియన్ సౌకర్యం కూడా ఉంది. డాక్టర్ల ఎంపిక, అపాయింట్‌మెంట్ సమయం అన్ని పేషంట్ ఇష్టమే. అమెరికన్ డాక్టర్ కన్సల్టేషన్, సెకండ్ ఒపీనియన్ ఇంత సులువుగా, తక్కువ ధరలో అందించడం అభినందనీయమే. ఏడాదికి పది లక్షలకు పైగా రోగులు చికిత్స కోసం వివిధ దేశాలకు వెళుతున్నారు. అదంతా ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. వైద్య సదుపాయాల విషయం లో హైదరాబాద్ ఎంతో వృద్ధి చెందినందువల్ల చికిత్స కోసం అమెరికాకి వెళ్ళే కన్నా అక్కడి వైద్య నైపుణ్యాన్ని ఇక్కడ వాడుకుంటే తక్కువ ప్రయాసతో మంచి వైద్యాన్ని అందుకోవచ్చని 'మై అమెరికన్ డాక్టర్' వ్యవస్థాపకుల అభిప్రాయం.మై యుఎస్ ఎడిఆర్ డాట్ కామ్‌లో అన్ని వివరాలు చూడవచ్చు. భారీ చెల్లింపులు ఎదురయే సందర్భాల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా తమ పాలసీదారులకు రెండో, మూడో వైద్య సలహా కోసం సొంత ఖర్చులతో ఏర్పాట్లు చేస్తాయి. సెకండ్ ఒపీనియన్ కవర్ అయ్యే హెల్త్ పాలసీ ఉన్నవారు దేశంలో ఉత్తమ వైద్యుని అభిప్రాయం పొందే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో కూడా ప్రముఖ వైద్యుల రెండో అభిప్రాయం సేకరణ ఇప్పుడు కొంత సులభతరమైంది.దేశంలో అత్యాధునిక ఆసుపత్రి అయిన అపోలో హాస్పిటల్ ఆన్‌లైన్ ద్వారా సెకండ్ ఒపీనియన్‌ను ఉచితంగా అందిస్తోంది. అపోలో సెకండ్ ఒపీనియన్ డాట్ కామ్ సైట్లో రోగి వివరాలు చేర్చి అన్ని సందేహాలు తీర్చుకోవచ్చు.చివరగా నిపుణుని సూచనలతో కూడిన పత్రాన్ని ఇ మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా పొందవచ్చు. ఇవే సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు యశోద, కాంటినెంటల్ హాస్పిటల్స్ తమ వెబ్ సైట్లలో పేర్కొన్నాయి. అలాంటి సౌకర్యం అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ ఉచితంగా ఇవ్వాలి. ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీలో దీనిని చేర్చాలి. రోగుల ఆశలు దిగజారుతున్నప్పుడు సెకండ్ ఒపీనియన్ ఒక్కోసారి ప్రాణం పోయవచ్చు.

## ఏం పిల్లడో ఎల్దమొస్తవ.. ఏం పిల్లో ఎల్దమొస్తవా..

### -నేడు జానపద వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు వర్ధంతి



వంగపండు ప్రసాదరావు జానపద వాగ్గేయకారుడు, జననాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు. అతను హేతువాది, ఉత్తరాంధ్ర గద్దర్ గా పేరు తెచ్చుకున్నాడు."ఏం పిల్లడో ఎల్దమొస్తవ.. ఏం పిల్లో ఎల్దమొస్తవా" అంటూ ఆయన సొంతంగా రాసి, పాడిన పాట తెలుగు రాష్ట్రంతో పాటు ఒకప్పుడు దేశంలోనే మారుమోగింది. "సికాకులంలో సీమలకొండకి.. ఏం పిలడో ఎల్దమొస్తవా.. చిలకలు కత్తులు దులపరిస్తయట.. సాలూరవతల సవర్లకొండకి.. ఏం పిలడో ఎల్దమొస్తవా.. సెవల పిల్లులే శంఖమూదెనట ..తెలంగాణా కొమరయ్య కొండకి అంటూ" శ్రీకాకుళ పోరాటం, ఇతర విప్లవ ఉద్యమాల నేపథ్యంలో రాసిన పాట చాల పాపులర్ అయ్యింది. భారతదేశంలోని అన్ని భాషలలోకి ఇతర దేశాలలోని వాళ్ల భాషల్లోకి ఈ పాటను అనువాదించుకొని పాడుకున్నారు అంటే ఈ పాట ఎంత పాపులర్ అయిందో తెలుసుకోవచ్చు. వంగపండు మూడు దశాబ్దాలలో 300కు పైగా పాటలు రాసాడు. అందులో 12 పాటలు అన్ని గిరిజన మాండలికాలతో పాటు తమిళం, బెంగాలీ, కన్నడ, హిందీ వంటి పది భారతీయ భాషలలోకి కూడా అనువదించారు కూడా. "యంత్రమెట్టా నడుస్తు ఉందంటే..." అనే పాట ఒక ఆచార్యునిచే ఇంగ్లీష్‌లో కూడా డబ్ చేసారు. అమెరికా, ఇంగ్లాండ్‌లో కూడా ఈ పాట సూపర్ హిట్ అయింది. విప్లవ కవిత్వంలో వంగపండు పాట ప్రముఖ పాత్ర వహించింది. వంగపండు ప్రసాదరావు విజయనగరం జిల్లా పార్వతీపురం దగ్గర పెదబొండపల్లిలో జూన్ 1943న జగన్నాథం, చినతల్లి దంపతులకు సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. అతనికి ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు ఉన్నారు. అందరి కంటే అతనే పెద్దవాడు. అతని చిన్నతనంలో పంట నూర్పిళ్లప్పుడు రాత్రిపూట మా తాత వాళ్లు పొలం దగ్గరకి వెళితే అతను వాళ్లతో పోయేవాడు. అప్పుడు అతని తాత, నాయిన, పెదనాయిన దేవుళ్ల కథలు చెప్పేవారు.చిన్నతనంలో అతనికి చదువు పెద్దగా అబ్బలేదు. ఎస్ ఎస్ ఎల్ సీ ఫెయిల్ కావడంతో బొబ్బిలిలో ఐటీఐ చేశాడు. అప్పట్లో చైనా యుద్ధంలో పాల్గొనాలనే పిలుపు వస్తే ఆ ట్రైనింగ్ తీసుకున్నాడు. ఆ యుద్ధం ఆగిపోవడంతో ఊరుబాట పట్టాడు. అప్పటికే అతని తండ్రి ఊళ్లో భూమి అమ్మేసి రాయగఢలో భూమి కొన్నాడు. తన తండ్రికి వ్యవసాయంలో కొంతకాలం తోడుగా ఉన్నాడు. వారి భూమి అడవికి దగ్గరగా ఉండేది. దీంతో అక్కడి గిరిజనులతో పరిచయాలు, వారి పదాలు అతని పాటల్లో బాగా దొర్లాయి. ఈ పనుల్లో పడి తెలిసిన పల్లె పదాలతో తోచిన బాణీలు కట్టుకుని పాడుతుంటే ఊళ్లో అంతా 'ఓరేయ్ కవీ' అని అతనిని పిలిచేవారు. అప్పట్లో అర్థంకాని పదాలు రాస్తేనే కవిత్వం అనుకునేవాడు. అతను లల్లాయ పదాలతో పాటలు అల్లుకుపోయేవాడు. ప్రజలు అతని చేత పాటలు పాడించుకుని, సరదా పడేవారు. అంతవరకు అతనికి సరదా సరదాగా గడిచిపోయింది.ఉద్యమంలో...వివాహం చేసుకున్న తరువాత రెండు సంవత్సరాలకు మొదలైన నక్సల్బరీ ఉద్యమం అతనిలో పెద్ద మార్పు తీసుకొచ్చింది. ఎక్కడ ఉన్నా ఉద్యమం అతని జీవితం లో ఒక భాగమయింది. ఆ ఉద్యమంలో ఎంతో మందిని కలిసాడు. ఎందరో కష్టాలను ప్రత్యక్షంగా చూసాడు. జనాన్ని జాగృతం చేయడానికి వాటన్నిటినీ పాటగా రూపుకట్టాడు. ఆ ఊపులో 400కు పైగా జాన పద పాటలు రాసాడు. వాటిలో 200కు పైగా గీతాలు మంచి గుర్తింపు తెచ్చాయి. ఉద్యమంలోకి వెళ్లిన ఏడాదికే విశాఖ షిప్ యార్డులో ఫిట్టర్‌మన్‌గా ఉద్యోగం వచ్చింది. కానీ ఉద్యోగం కంటే ఉద్యమమే అతనికి ఆత్మ సంతృప్తినిచ్చింది. షిప్‌యార్డులో పని చేస్తూ ఉన్నా మనసంతా అతనికి ఉద్యమం వైపే ఉండేది. దీంతో పదిరోజులు పనికెళ్లడం, ఇరవై రోజులు పాటలు పాడుకుంటూ ఊళ్లలో తిరగడం చేసేవాడు. అలా కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ , కర్ణాటక రాష్ట్రాలన్నీ తిరిగాడు. ఇలా తిరుగుతూ ఉంటే ఇంట్లో పూట గడవని స్థితి ఏర్పోడింది. ఒక పూట తింటే మరో పూట పస్తు ఉండే పరిస్థితి ఏర్పడింది. అయినా సరే అతను నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదు. ఆరేళ్ళు సర్వీసు ఉన్నా స్వచ్ఛంద పదవీవిరమణ చేసి పూర్తి స్థాయి ఉద్యమంలో కొనసాగాడు.మధ్యతరగతి కుంటుంబాలకు ఉద్యమాలు సరిపోవని అనుకున్నాడు. ఉద్యోగం వదులుకున్నప్పుడు ఎంతో మానసిక క్షోభ అనుభవించాడు. ఇంట్లో నలుగురు పిల్లలు, భార్య. వారికి కనీసం కడుపు నిండా తిండి కూడా పెట్టలేనప్పుడు ఈ ఉద్యమాలెందుకన్న ఆలోచనలో మధనపడేవాడు. మళ్లీ కొన్నాళ్లు స్వంత గ్రామంలో వ్యవసాయం చేశాడు కానీ కలిసిరాలేదు. ఆకలి బాధ కోసం ఆత్మాభిమానం చంపుకోకూడద నిపించి మళ్లీ ఉద్యమం బాటే పట్టాడు.దర్శకులు టి.కృష్ణ, ఆర్. నారాయణమూర్తిలతో పాటు మరికొందరు వారి సినిమాలకు పాటలు రాయమని అతనిని కోరారు. అలా 30 సినిమాల వరకు రాశాడు. అలాగే ఆరేడు సినిమాల్లోనూ నటించాడు. కొన్ని సినిమాలకు పాటలు రాసే అవకాశాలొచ్చినా జననాట్యమండలి నిబంధనలకు కట్టుబడి రాయలేదు. సినిమాలకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే అతని జీవితం మరోలా ఉండేది.2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది సందర్భంగా కళారత్న పురస్కారం అందుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయనగరం జిల్లా పార్వతీపురంలో 2020 ఆగస్టు 4న తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూశాడు.తన జీవితమంతా ప్రజా ఉద్యమాలు, జానపద కళలకే వెచ్చించిన వంగపండు తుదిశ్వాస వరకు అత్యంత సాధారణ జీవితం గడిపారు. వంగపండు చనిపోయినప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల సీఎంలు జగన్, కేసీఆర్‌లు సంతాపం ప్రకటించారు. ఏపీ సర్కార్ వంగపండు జానపద పురస్కారం ఏర్పాటు చేసింది. ఎంపికైన వారికి రూ.2 లక్షల నగదు బహుమానం, ప్రశంసాపత్రం ఇవ్వనున్నారు. ఏటా వంగపండు వర్ధంతి అయిన ఆగస్టు 4న పురస్కారం ఇవ్వనున్నట్లు సాంస్కృతిక శాఖ తెలిపింది.

## జేసీ ఫ్యామిలీకి పెద్దపీట



అనంతపురం, ఆగస్టు 3 రాయలసీమలో జెసి కుటుంబానిది ప్రత్యేక స్థానం. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఆ కుటుంబానిది. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆ కుటుంబం ఒక వెలుగు వెలిగింది. రాష్ట్ర విభజనతో తెలుగుదేశం పార్టీలోకి వచ్చింది. అనంతపురం జిల్లాలో పరిటాల కుటుంబంతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా.. చంద్రబాబు ఇరు కుటుంబాలను సమన్వయం చేశారు. టిడిపిలో కొనసాగేలా చూసుకున్నారు. అయితే ఆ కుటుంబాన్ని జగన్ వేధించారు. అధికారంలోకి రాగానే వ్యాపార మూలాలను దెబ్బ కొట్టారు. జెసి ట్రావెల్స్ ను మూతపడేలా చేశారు. ఎంపీగా ఉన్న జెసి దివాకర్ రెడ్డి పై సవాల్ చేసిన గోరంట్ల మాధవ్ కు టికెట్ ఇచ్చారు. అదే దివాకర్ రెడ్డి పై మాధవ్ ను నిలిపి అవమానపరిచారు. ఎన్నో రకాలుగా కేసులు పెట్టారు. బెదిరింపులకు దిగారు. అయినా జెసి కుటుంబం టిడిపిని వదల్లేదు. టిడిపి బలోపేతానికి కృషి చేస్తూ వచ్చింది ఆ కుటుంబం. అయితే ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చింది. జెసి కుటుంబం తమకు జరిగిన అన్యాయంపై పోరాటం చేయడం ప్రారంభించింది. తాడిపత్రి ఎమ్మెల్యేగా జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డి ఎన్నికయ్యారు. ప్రభాకర్ రెడ్డి దూకుడు పెంచారు. ఇటీవల తమపై పెట్టిన తప్పుడు కేసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. అంతటితో ఆగకుండా జగన్ తల్లి విజయమ్మను కలిసి ఆశ్చర్యపరిచారు. అయితే జెసి దివాకర్ రెడ్డి అనారోగ్యం కారణంగా పెద్దగా కనిపించడం లేదు. ఆయన కుమారుడు సైతం ఎన్నికల్లో పోటీ చేయలేదు. అస్మిత్ రెడ్డికి మద్దతుగా ప్రచారం మాత్రం చేశారువాస్తవానికి రాష్ట్ర మంత్రివర్గంలో జెసి కుటుంబానికి ప్రాతినిధ్యం దక్కుతుందని అంతా భావించారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి ఓడిపోయినా.. తాడిపత్రి మున్సిపాలిటీలో మాత్రం గెలిచింది. అంతలా పట్టు నిలుపుకున్నారు ప్రభాకర్ రెడ్డి. ఈ ఎన్నికల్లో తాడిపత్రి అసెంబ్లీ స్థానం నుంచి ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డి పోటీ చేసి గెలిచారు. అనంతపురం ఎంపీ టికెట్ ను దివాకర్ రెడ్డి తనయుడు పవన్ రెడ్డి ఆశించారు. 2019 ఎన్నికల్లో ఆయనే పోటీ చేసినందున.. మరోసారి బరిలో దిగేందుకు ప్లాన్ చేసుకున్నారు. కానీ చంద్రబాబు బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చారు. అయినా సరే పవన్ రెడ్డి టిడిపికి ప్రచారం చేశారు.తాజాగా చంద్రబాబు జెసి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పవన్ రెడ్డిని నియమిస్తారని సమాచారం. వైసిపి హయాంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ను విజయసాయిరెడ్డి ఆక్రమించుకున్నారు. తన అల్లుడితో పాటు ఆయన సోదరుడికి ఏసీఏను అప్పగించారు. మరో బినామీతో కలిసి అడ్డగోలుగా దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే వారందరినీ ఏసీఏ నుంచి తరలించి ప్రక్షాళన చేస్తారని సమాచారం. ఈ నెల నాలుగున ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేస్తారని తెలుస్తోంది.జెసి పవన్ రెడ్డికి క్రికెట్ రంగంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అంతర్జాతీయ క్రీడాకారులతో సైతం సన్నిహితంగా గడుపుతారని తెలుస్తోంది. ఏసీఏను పవన్ రెడ్డికి అప్పగిస్తే గాడిలో పెడతారని.. క్రీడాభివృద్ధికి పాటు పడతారని చంద్రబాబు భావిస్తున్నారు. మరోవైపు ఎమ్మెస్ కే ప్రసాద్ సైతం ఏసీఏ అధ్యక్షుడిగా ఎంపిక కావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జెసి పవన్ రెడ్డి కోరితే మాత్రం చంద్రబాబు కాదనే పరిస్థితి ఉండదు. మరి ఏం జరుగుతుందో చూడాలి

## విశాఖలో ఎమ్మెల్సీ ఎన్నికల హీట్

విశాఖపట్టణం, ఆగస్టు 3 ,విశాఖపట్నం స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు 30 ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల్లో అత్యధిక సీట్లున్న వైసీపీని ఎదుర్కొని ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలవాల్సి ఉంది. ఒకవేళ ఓటమి చెందితే కూటమి ప్రభుత్వానికి తొలి పరాభవం ఎదురైనట్లే. ఇటీవలి తెలంగాణలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలా జరిగింది. అధికారం కాంగ్రెస్ కాకుండా?. ప్రతిపక్ష బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీని గెలుచుకుంది.అఖండ మెజార్టీ తరువాత జరిగే తొలి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ కూటమి ప్రయత్నిస్తుంది. అయితే ప్రతిపక్ష వైసీపీకి ఎక్కువ ఓట్లు ఉన్న ఈ స్థానంలో కూటమికి గెలుపు పెద్ద సవాల్‌గా ఉంది. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలకే జరిగిన తొలి ఎన్నికల్లో విజయం సాధించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మకం అయింది.సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం వైసీపీ తన ఉనికిని సవాల్‌గా మారింది. వైసీపీ ఈ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుంటే?. అధికారం కోల్పోయిన తరువాత నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తలకు, నాయకులకు ఒక సందేశం ఇచ్చినట్లు ఉంటుంది. కనుక ఈ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు అధికార టీడీపీ కూటమికి, ప్రతిపక్ష వైసీపీకి సవాల్‌గా మారాయి.ఆగస్టు 30న జరిగే ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం తొలి పరీక్ష ఎదుర్కొబోతుంది. సంఖ్య బలం బట్టి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు అత్యధికంగా వైసీపీకి ఉన్నారు. అధికార టీడీపీకి చాలా తక్కువ ఉన్నారు. అయితే ప్రతిపక్ష వైసీపీకి ఎక్కువ మంది స్థానిక సంస్థల సభ్యులు ఉన్నప్పటికీ, వారంతా వైసీపీ అభ్యర్థికి ఓటేస్తారా? అనే మీమాంసం నెలకొంది. అయితే తక్కువ మంది స్థానిక సంస్థల సభ్యులున్న అధికార టీడీపీ గెలవడానికి వైసీపీ సభ్యులను లాగాల్సి ఉంటుంది. టీడీపీ ఆ ప్రయత్నాలను మొదలు పెట్టింది. అయితే వైసీపీ నుంచి వలసలను నివారించడానికి ఆ పార్టీ కూడా ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవలి జీవీఎంసీ వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో జీవీఎంసీని సొంతం చేసుకోవాలని టీడీపీ కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే వైసీపీ నుంచి కార్పొరేటర్లను టీడీపీలోకి లాక్కొంటుంది.

## వయనాడ్ సహాయక చర్యలకు మోహన్ లాల్

### ఆర్మీ కల్నల్ హోదాలో పాల్గొన్న స్టార్



వయనాడ్,ఆగస్ట్3 : వయనాడ్ ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు హీరో మోహన్‌లాల్ స్వయంగా ముందుకొచ్చారు. శనివారం ఆయన టెరిటోరియల్ ఆర్మీ బేస్ క్యాంపునకు చేరుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్న మోహన్‌లాల్.. విపత్తు ప్రాంతాన్ని సందర్శించి సైనికులతో సమావేశం కానున్నారు. కోజికోడ్ నుంచి రోడ్ మార్గంలో వయనాడ్‌కు వెళ్లి ఆర్మీ అధికారులతో చర్చలు జరిపారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఎంతోమంది మృతిచెందడం యావత్ దేశాన్ని కలచివేస్తోంది. ఈ క్రమంలో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు దేశవ్యాప్తంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకువస్తున్నారు. ఇప్పటికే పలువురు నటులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీ విరాళాలు ఇచ్చారు. తాజాగా కమల్‌హాసన్ రూ.25లక్షలు విరాళం అందించారు. మరోవైపు ఆచూకీ గల్లంతైనవారిని గుర్తించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎక్కడెక్కడ ఎవరు చిక్కుకుపోయారో తెలుసుకునేందుకు డ్రోన్లు, రాడార్లు, మొబైల్ ఫోన్ల సిగ్నళ్ల ద్వారా ముమ్మర ప్రయత్నం కొనసాగుతోంది. ఇంకా వందలమంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.

## సోమాలియాలో ఆత్మాహుతి దాడి.. 32 మంది మృతి




అబ్దియాజ్: సోమాలియా రాజధానిలోని బీచ్ వద్ద ఉన్న హోటల్‌లో ఆత్మాహుతి దాడిజరిగింది. ఆ దాడిలో 32 మంది మృతిచెందారు. అనేక మంది గాయపడ్డారు. సూసైడ్ బాంబర్, ఓ గన్‌మెన్.. బీచ్ లొకేషన్‌లో అలజడి సృష్టించారు. సుమారు 63 మంది గాయపడినట్లు పోలీసు ప్రతినిధి అదన్ హసన్ తెలిపారు. అబ్దియాజ్ జిల్లాలో జరిగిన అటాక్‌తో మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అల్ షబాబ్ మిలిటెంట్లు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. సోమాలియాలోని దక్షిణ, సెంట్రల్ ప్రదేశాల్లో అల్ షబాబ్ మిలిటెంట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. ఆల్ ఖయిదాకు అనుబంధ సంస్థ అయిన అల్ షబాబ్ గత 20 ఏళ్ల నుంచి ఆ ప్రాంతంలో రక్తపాతం సృష్టిస్తోంది.

## కాల్ వస్తే వారికి 'రూట్ క్లియర్'...

విజయవాడ, ఆగస్టు 3విజయవాడ నగర వాసులను ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. రోడ్డు ఎక్కితే అనుకున్న టైంలో గమ్యానికి చేరుతామా..? లేదా..? అన్నది గుబులు పుట్టిస్తోంది. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు రహదారులపైనే గంటల తరబడి గడపాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఓవైపు భారీ స్థాయిలో వాహనాలు రోడ్లపైకి వస్తుడంగా... మరోవైపు వీఐపీ వాహనాల రాకపోకలు నగరంలో ఎక్కువైపోయాయి.ఓవైపు సాధారణ వాహనాలను నియంత్రిస్తూ రూట్ క్లియర్ చేయటమే సవాల్ గా ఉంటుంది. ఇదే సమయంలో వీఐపీ వాహనాల రూట్ క్లియర్ కోసం పైనుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయాల్సి ఉంటుంది. రూట్ క్లియర్ చేయాలంటే... సాధారణ వాహనాలను ఆపాల్సిందే..! దీంతో రోడ్లపై వాహనాల రద్దీతో తీవ్రంగా పెరిగిపోతుంది. రోడ్డంతా వాహనాలతో కిక్కిరిసిపోతున్న పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. దీంతో సాధారణ జనం అవస్థలు పడుతున్నారు.మంత్రుల ఎస్కార్ట్ వాహనాలతో పాటు వీఐపీ వాహనాల రూట్ క్లియర్ చేసే క్రమంలో అసలు పని వదిలేసి వీఐపీ వాహనాల సేవలో పోలీసులు తరిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఒకే సమయంలో సచివాలయానికి ఎస్కార్ట్ వాహనాలతో వేర్వేరు ప్రాంతాల నుంచి మంత్రులతో పాటు ప్రొటోకాల్ ఉన్న పలువురు బయల్దేరుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో ఎస్కార్ట్ కు రూట్ క్లియర్ చేసేందుకు టైం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చాలా మంది మంత్రుల ఎస్కార్టులు ఒకేసారి రోడ్లపైకి రావటంతో సామన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.ఎస్కార్ట్ కోసం రూట్ క్లియర్ చేయకపోతే మంత్రి కాన్వాయ్ ట్రాఫిక్ లో చిక్కుకుపోతున్న పరిమామాలు కూడా వెలుగు చూస్తున్నాయి. రూట్ క్లియర్ లేకుండా ఇలాంటి ఘటనలు జరిగితే అధికారులు, సిబ్బందిపై మంత్రులు గుర్రుమంటున్నారన్న టాక్ కూడా వినిపిస్తోంది. నగరంలో ముఖ్యంగా ఉదయం 10-11 మధ్య పోలీసులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది.ఎస్కార్ట్ వాహనాల కోసం సాధారణ ట్రాఫిక్ ఆపేయాలని కంట్రోల్ రూమ్ పై ఎస్కార్ట్ సిబ్బంది ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ మేరకే పోలీస్ కంట్రోల్ రూమ్ అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. ఏకకాలంలో న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మంత్రుల కోసం ట్రాఫిక్ క్లియర్ చేయాలని సమాచారం అందుతుండటంతో పోలీసులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు.సగటున 60-70 మంది ఎఎఖల కోసం ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్న పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయి. డీజీపి, చీఫ్ సెక్రటరీ, పోలీసు ఉన్నతాధికారుల వాహనాలు వెళ్ళినా?. ట్రాఫిక్ ఆపేయాలని పైనుంచి ఆదేశాలు వస్తున్నాయం ట..! దీంతో ఆటో నగర్ గేట్ నుంచి పటమట, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీఏ, రాఘవయ్య పార్క్, బందరు లాకులు, వై జంక్షన్, ఖఖఖీ, వినాయక టెంపుల్, ప్రకాశం బ్యారేజ్ కూడళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది.

ప్రస్థానం తెలుగు దినపత్రిక మన దేశం..మన హక్కు



# పురోగతి లేని కంటైనర్ కేసు

విశాఖపట్టణం, ఆగస్టు 3, సరిగ్గా ఎన్నికలకు ముందు అంటే దాదాపు 4 నెలల క్రితం విశాఖ తీరానికి భారీ మొత్తంలో డ్రగ్స్‌తో ఓ కంటైనర్ రావడం ఏపీవ్యాప్తంగా సంచలనం రేపింది. అదే డ్రగ్స్ ఇష్యూని ఎన్నికల ప్రధానాంశంగా మార్చుకున్న అప్పటి పాలక, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం మారింది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎన్డీయే.. అధికారంలోకి వచ్చినా కూడా దానిపై దర్యాప్తు చేపట్టలేదు. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా.. 4 నెలలుగా ఎలాంటి పురోగతి లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో మార్చి 16న కంటైనర్ విశాఖ పోర్టుకు చేరింది. దీనిపై ఇంటర్‌పోల్ సమాచారంతో ఆపరేషన్ గరుడ పేరుతో ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారులు కంటెయినర్‌ను తెరిచి బ్యాగ్‌లను పరిశీలించారు. మత్తు పదార్థాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఆ తర్వాత మార్చి 19న డ్రగ్స్ నమూనాలు సేకరించి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి కంటెయినర్‌కు సీల్ వేశారు.విశాఖ డ్రగ్ కంటైనర్‌పై సీబీఐ దర్యాప్తు విషయాల్లో ప్రతిపక్ష వైసీపీ.. అనేక అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అయితే ఈ కంటైనర్ షిప్‌ను సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ.. బ్రెజిల్ నుంచి తీసుకొచ్చినట్లు సీబీఐ గుర్తించింది. దీంతో వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.తాజాగా ఈ కేసుపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వంపై ఫైరయ్యారు. నాలుగు నెలలైనా కేసు దర్యాప్తు ముందుకు కదలడం లేదు ఎందుకు అని ప్రశ్నించారు. ఈ కేసు ఫైల్ చేసినపుడు తమ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఆరోపణలు చేశారన్న ఆయన.. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి సర్కార్ విశాఖ డ్రగ్ కంటైనర్ ఘటనపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మరోవైపు కేసు విచారణ జరుగుతుందని.. సీబీఐ దగ్గర నుండి దర్యాప్తు వివరాలు తీసుకుని మీడియాకు వెల్లడిస్తానని హోం మంత్రి వంగలపూడి అనిత అంటున్నారు.సీజ్ చేసిన కంటెయినర్.. ఇంకా విశాఖలోని ఎగ్జామిన్ పాయింట్‌లోనే ఉంది. దీనికి సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తోంది. డిఆర్ఐ సీజ్ చేసిన 10 కంటెయినర్లు సైతం అక్కడే ఏడెనిమిదేళ్లుగా పడి ఉన్నాయి. బ్రెజిల్ నుండి కంటైనర్‌లో విశాఖకు డ్రగ్స్ వస్తున్నాయని ఇంటర్పోల్ నుండి సమాచారం తెలియడంతో విశాఖ, చెన్నై పోర్టులో హడావుడి చేసిన గత అధికారులు.. ఇప్పుడు దాని ఊసే ఎత్తకపోవడంతో ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. ఈ కేసు కూడా అలాగే మరుగున పడిపోతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# అక్టోబరు నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ

విజయవాడ, ఆగస్టు 3,నూతన మద్యం పాలసీ రూపకల్పనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త విధానం రూపకల్పనకు వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం ప్రకటించారు. ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం కోసం అధికారులతో కూడిన నాలుగు బృందాలను ఏర్పాటు చేసింది ఏపీ సర్కార్. ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున అధికారులు ఉండనున్నారు. రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు నాలుగు బృందాలు వెళ్లనున్నాయి. ఆయా రాష్ట్రాల్లోని ఎక్సైజ్ పాలసీ, మద్యం షాపులు, బార్లు, లిక్కర్ ధరలు, మద్యం కొనుగోళ్లు, నాణ్యత, చెల్లింపుల విధానం, డిజిటల్ పేమెంట్ అంశాలపై ఈ బృందాలు అధ్యయనం చేయనున్నాయి.అలాగే అక్రమ మద్యం నివారణ, డ్రగ్ కంట్రోల్‌పై కూడా అధికారుల బృందం అధ్యయనం చేయనుంది. ట్రాక్ అండ్ ట్రేస్, డీఅడిక్షన్ సెంటర్ల నిర్వహణ వంటి అంశాల పైనా దృష్టి సారించనున్నారు. ఆయా రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలపై ప్రభుత్వానికి బృందాలు నివేదిక ఇవ్వనున్నాయి. ఆగస్ట్ 12వ తేదీ లోగా నివేదికలు సమర్పించాలని నాలుగు అధ్యయన బృందాలకు ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబరు 1 నుంచి కొత్త ఎక్సైజ్ విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది.

# టార్గెట్ బాలినేని...

ఒంగోలు, ఆగస్టు 3, ఒంగోలులో రాజకీయం హైటెన్షన్‌గా మారింది? కొత్త ప్రభుత్వం కొలువుదీరిన రెండు నెలల్లోనే ఇంతలా పొలిటికల్ హీట్ పెరగడానికి కారణమేంటి? ఒంగోలు రాజకీయాల్లో ఏం జరుగుతోంది.రాష్ట్రంలో హైటెన్షన్ నియోజకవర్గాల్లో ఒంగోలు ఒకటి?. ఇక్కడ ఎప్పుడూ రాజకీయాలు వాడివేడిగా ఉంటాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మధ్య రాజకీయం మండే అగ్నిపర్వతాన్ని తలపిస్తుంది. నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్లు ఈ ఇద్దరు ఎప్పుడూ యుద్ధానికి సిద్ధమన్నట్లే దూకుడుగా వ్యవహరిస్తుంటారు. ఎన్నికల సమయంలో సహజంగా ఉండే ఈ హైటెన్షన్? ఎన్నికల ఫలితాలు విడుదలైన రెండు నెలల తర్వాత కొనసాగుతుండటమే హీట్ పుట్టిస్తోంది.ఒంగోలు ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత ఘోరంగా ఓడిపోయారు. గత ప్రభుత్వంలో మూడేళ్లపాటు మంత్రిగా పనిచేసిన బాలినేని?. మంత్రి పదవి పోయిన తర్వాత సొంత పార్టీపై కొంత అసంతృప్తితో ఉండేవారు. తన నియోజకవర్గ అభివృద్ధి కోసమంటూ నిత్యం అలకపాన్పు ఎక్కి? తనకు కావాల్సినవి సాధించుకునే వారు. ఇదే సమయంలో మంత్రి పదవి లేకపోయినా?. జిల్లాలో తనకు ఎదురు లేనట్లే రాజకీయం నడిపే వారు బాలినేని? వైసీపీ అధినేత జగన్‌తో దగ్గరి బంధుత్వం ఉండటంతో జిల్లాలో బాలినేనికి ఎదురు చెప్పే వారు లేకపోయే వారు.దీంతో ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డిపై పలు భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చాయి. వీరి కుటుంబానికి చెందిన శ్రీకర విల్లాస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థపైనా చాలా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో బాలినేనిని ఎవరూ టచ్ చేయలేకపోయారు. ఐతే ఇప్పుడు వైసీపీ ఓటమి తర్వాత బాలినేని టార్గెట్‌గా పావులు కదుపుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్? బాలినేని చుట్టూ ఉచ్చుబిగించేలా అడుగులు వేస్తున్నారు.బాలినేనిని రాజకీయంగా ఒంటరి చేయాలనే ఎత్తుగడతో ఒంగోలు కార్పొరేషన్‌పై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే జనార్దన్ పలువురు కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకున్నారు. ఇక బాలినేని అనుచరుడు.. గత ప్రభుత్వంలో బాలినేని బాధితుడైన సుబ్బారావు గుప్తాను తెరపైకి తెచ్చి? బాలినేని హయాంలో జరిగిన అక్రమాలన్నీ తవ్వితీస్తున్నారు. అంతేకాకుండా ఒకప్పుడు ఒంగోలులో ఎదురే లేదన్నట్లు హవా నడిపిన బాలినేనిని సవాల్ చేస్తూ పోస్టర్లు వేస్తుండటం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది.గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల పంపిణీతోపాటు ల్యాండ్, శాండ్ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విచారణ జరిపిస్తోంది ప్రభుత్వం. అదే సమయంలో గతంలో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసిన వారిని తాజాగా గుర్తిస్తూ అరెస్టు చేయిస్తుండటంతో వైసీపీ కార్యకర్తలు టెన్షన్ పడుతున్నారు.ఎన్నికల ముందువరకు ఒంగోలులో చక్రం తిప్పిన బాలినేని? ఫలితాలు విడుదలైన తర్వాత ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడుపుతున్నారు. ఈ మధ్య ఒకసారి ఒంగోలు వచ్చిన బాలినేని మళ్లీ రెండు నెలల తర్వాత వస్తానని చెప్పి వెళ్లిపోయారు. మరోవైపు బాలినేని, ఆయన అనుచరులు టార్గెట్‌గా ఎమ్మెల్యే దామచర్ల వెంటాడుతుండటంతో వైసీపీ శ్రేణులు బిక్కుబిక్కుమంటున్నాయి.

# ప్రారంభ మైన రాజకీయ వివాదం

విజయవాడ, ఆగస్టు 3,షెడ్యూల్డ్, తెగల వర్గాల వర్గీకరణ వివాదం దశాబ్దాలుగా ఉంది. ఎస్సీలుగా గుర్తింపు పొందిన వారిలో కొన్ని ఆధిపత్య కులాలకే అవకాశాలు దక్కుతున్నాయని ఇతరులకు దక్కడం లేదన్న అభిప్రాయం ఎస్సీల్లోనే ఉంది. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకూ మాలలు, మాదిగల్ని ఎస్సీ జాబితాలో చేర్చారు. మరికొన్ని కులాలు, ఉపకులాలు ఉన్నాయి. కానీ ప్రధానంగా మాలలు ఎక్కువ అవకాశాలు పొందుతున్నారని మాదిగ సామాజికవర్గం వారు వర్గీకరణ కోసం పోరాడారు. జనాభాలో మాదిగలు ఎక్కువగా ఉన్నా మాలలకే ఎక్కువ అవకాశాలు వస్తున్నాయన్న భావనతో మంద కృష్ణ మాదిగ ఉద్యమం ప్రారంభించారు. అది దశాబ్దాలుగా కొనసాగుతోంది. రాజకీయ పార్టీలు ఎక్కువగా వర్గీకరణకు కట్టుబడి ఉన్నాయని చెబుతూ డబుల్ గేమ్ ఆడుతూ రావడంతో అది వివాదాస్పదమయింది. గతంలో సుప్రీంకోర్టు కూడా వర్గీకరణ కుదరదని స్పష్టం చేసింది. కానీ ఇప్పుడు సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అధికారం ఇస్తూ తీర్పు చెప్పింది. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో.. అన్ని రాష్ట్రాలకు అధికారాలు దఖలు పడినట్లే. ఇప్పుడు రాష్ట్రాలు వర్గీకరణ చేయాల్సి ఉంటుంది. అయితే ఇది అంత తేలిక కాదు. ఎందుకంటే వర్గీకరణకు వ్యతిరేకంగా కొన్ని కులాలు, అలాగే.. ఏబీసీడీలుగా వర్గీకరించే విషయంలో మరికొన్ని కులాలు తమ వాదన గట్టిగా వినిపించే అవకాశాలు ఉన్నాయి. రాజకీయ పార్టీలు ఇలాంటి వాతావరణాన్ని తమకు అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం చేస్తాయనడంలో సందేహం లేదు. మాజీ ఎంపీ హర్షకుమార్ అసలు సుప్రీంకోర్టుకు ఎస్సీ వర్గీకరణ గురించి తీర్పు చెప్పే అధికారం లేదని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించే ప్రశ్నే లేదని మాలలతో కలిసి ఉద్యమం చేస్తామని చెప్పారు. ఒక వేళ ఇతర వర్గాలు కలసి వచ్చి వర్గీకరణ కసరత్తు ప్రారంభించినా.. తాము అత్యంత వెనుబడిన వర్గమని ప్రతి ఎస్సీ కులం వాదిస్తుంది. అందరూ ఏ కేటగిరీలోనే ఉండాలనుకుంటారు. వీరందర్నీ సముదాయించి.. వర్గీకరణ చేయడం కత్తి మీద సామె. ఎస్సీ కేటగిరి కింద మొత్తం 59 వరకూ కులాలను గుర్తించారు. అయితే మాల, మాదిగ వర్గాలకు చెందిన వారే ఇందులో 70 శాతం వరకూ ఉంటారు. ఇతర కులాలకు చెందిన వారి సంఖ్య ముప్పై శాతం వరకూ ఉండొచ్చు. అయితే అవకాశాలు మాత్రం ఎక్కువగా మాల వర్గానికే వెళ్తున్నాయని మాదిగలతో పాటు ఇతర కులాల భావనం. మాలలు ఆర్థికంగా, విద్యాపరంగా కొంత అభివృద్ధి చెందారని కానీ ఇతర కులాలు అవకాశాలు అంది పుచ్చుకోవడంలో విఫలమయ్యారన్న కారణంతో మందకృష్ణ మాదిగ వర్గీకరణ పోరాటాన్ని ప్రారంభించారు. రాజకీయంగా ప్రభావితం చేసే స్థాయికి ఉద్యమం చేరడంతో రెండో సారి సీఎం అయిన తర్వాత చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు. 2000-2004 వరకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ను అమలు చేసింది. వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆవిర్భవించింది. అప్పట్లో కాంగ్రెస్ నేతలు ఈ మాలమహానాడును ప్రోత్సహించడంలో ఎస్సీల్లో స్పష్టమైన చీలిక వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యాయపరమైన చిక్కుల్లో పడి ఆచరణ ఆగిపోయింది. మళ్లీ ఇప్పటికి అమల్లోకి తెచ్చే అవకాశాన్ని సుప్రీంకోర్టు కల్పించింది. ఎస్సీ వర్గీకరణను రాజకీయంగా వాడుకునేందుకు పార్టీలు తొందరపడితే రాజకీయంగా నష్టం సంభవించే అవకాశాలు ఉన్నారు. సుప్రీంకోర్టులో తీర్పు రాగానే.. ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా మార్పులు చేస్తామని వెంటనే వర్గీకరణ చేస్తామన తెలంగాణ సీఎం రేవంత్ ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబు జనాభా దామాషా ప్రకారం అందరికీ అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. చంద్రబాబునాయు?డు సీఎంగా ఉన్నప్పుడు చేసిన వర్గీకరణను ఇప్పుడు అమలు చేయలేరు. మారిన సామాజిక పరిస్థితులతో మరోసారి ఎస్సీ కులాలను నాలుగు విభాగాల కింద వర్గీకరించాల్సి ఉంటుంది. ఇందులో ఇతర పార్టీలు ఖచ్చితంగా రాజకీయం చేస్తాయి. అందులో సందేహం ఉండదు. మెజార్టీని ఆకట్టుకునే క్రమంలో .. ఇతర వర్గాలను నిర్లక్ష్యం చేస్తే.. మొదటికే మోసం వస్తుంది. రిజర్వేషన్లు, వర్గీకరణలతో రాజకీయం రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదే. ఇప్పుడు ఇలాంటి అంశంతో .. అధికార పార్టీలు రాజకీయం చేయాలనుకుంటున్నాయి. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే.. ఎస్సీ వర్గీకరణ అనే అంశానికి సుప్రీంకోర్టు తీర్పుతో ముగింపు పడలేదు.

# రగిలిపోతున్న కేతిరెడ్డి

అనంతపురం, ఆగస్టు 3,ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఓటమి తర్వాత పార్టీకి ఇబ్బందికరంగా మారారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ పైనే విమర్శలు చేస్తున్నారు. పార్టీ ఓటమి పాలు కావడానికి అనేక కారణాలున్నాయి. అందులో జగన్ కూడా ఒకరు అని వేరే చెప్పాల్సిన పనిలేదు. అయితే అధినాయకత్వాన్ని తప్పుపట్టేందుకు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఎందుకు ఉత్సాహం చూపుతున్నారు? ఆయన పార్టీని వీడే ఆలోచన ఉందా? పార్టీని వీడితే ఏ పార్టీలో చేరతారు? వైఎస్ జగన్ మనస్తత్వం తెలిసి కూడా ఆయన విమర్శలకు సిద్ధమవుతున్నారంటే కేతిరెడ్డి రాజకీయంగా తెగించినట్లే కనపడుతుంది.



పార్టీ తనపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలనే ఆయన ఈ రకమైన కామెంట్స్ చేస్తున్నారని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. జగన్ సొంత జిల్లా కడపలోనూ గత ఎన్నికల్లో దారుణ ఓటమి సంభవించింది. ఓటమికి సవాలక్ష కారణాలున్నాయి. అవి చెప్పుకుంటూ పోతే కొండవీటి చాంతాడంత అవుతుంది. అయితే పార్టీ కష్ట సమయాల్లో అండగా ఉండాల్సిన కేతిరి?డ్డి వెంకట్రామిరెడ్డి నేరుగా జగన్ వైఖరిని తప్పుపట్టడాన్ని చూస్తుంటే ఆయన పక్క చూపులు చూస్తున్నట్లే అర్థమవుతుంది. ఎందుకంటే గతంలో ఒక ప్రయివేటు యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ జగన్ వైఖరిని తప్పుపట్టారు. మద్యం విషయంలో తమ ప్రభుత్వం విఫలమయిందన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు కూడా తమకు అవకాశం లేదని చెప్పారు. సీఎంవోలో ధనుంజయ్ రెడ్డి వ్యవహార శైలిపై ధ్వజమెత్తారు.ఇక తాజాగా జగన్ ప్రస్తుత ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను కూడా తప్పుపట్టారు. మనం మొత్తం అప్పులు చేసి ఒక్క ఏడాది టైం కూడా ఇవ్వకుండా వాళ్ళ మీద పడితే ఎలా? అంటూ ప్రశ్నించారు. వాళ్ళకి సంపద సృష్టికి టైం ఇవ్వాలి కదా? అని అన్నారు. ఒక్క ఏడాది కూడా ఆగలేరా? ఇదేమి రాజకీయం అంటూ జగన్ పై కేతిరెడ్డి నేరుగా విమర్శలకు దిగారు. కేతిరెడ్డి అన్నదాంట్లో వాస్తవముండి ఉండవచ్చు. కొంత టైం ప్రస్తుత ప్రభుత్వానికి ఇవ్వాల్సిన అవసరమూ నిజమే. అదే సమయంలో కార్యకర్తలను కాపాడుకోవాలన్నా, నేతల్లో ధైర్యం నింపాలన్నా జగన్ ఆ మాత్రం విమర్శలు చేయాలన్నది కేతిరెడ్డికి తెలియనిదా?దానికి మాత్రం ఆయన వద్ద జవాబు లేదు. కేతిరెడ్డి ఒకసారి కాంగ్రెస్ నుంచి మరొక సారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. రెండు సార్లు ఓటమి పాలయ్యారు. తాను ఎంత అభివృద్ధి చేసినా, ప్రజల్లోనే నిరంతరం ఉన్నప్పటికీ తన ఓటమికి కారణం తాను కాదని కేతిరెడ్డి గట్టిగా భావిస్తున్నట్లుంది. తన ఓటమికి పక్కా జగన్ మాత్రమే కారణమని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే అదే సమయంలో జగన్ పై చేస్తున్న విమర్శలు ధర్మవరం నియోజకవర్గంలోని పార్టీ క్యాడర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ఇంతకూ కేతిరెడ్డి జగన్ పైనా, పార్టీ నాయకత్వంపై బహిరంగ విమర్శలు చేయడం ఎందుకన్నది మాత్రం తెలియడం లేదు. ఆయన ఆలోచన ఎలా సాగుతుందో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# వైద్యం, సంగీతంలో అద్వితీయ ప్రతిభ

## బహుముఖ ప్రతిభాశాలి పినాకపాణి

శ్రీకాకుళం,ఆగస్ట్3(ఆర్ఎన్ఎ): పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి... ఈ పేరు వినగానే మనకు ఓ ప్రఖ్యాత వైద్యుడే కాకుండా ఒక కర్ణాటక సంగీత విద్వాంసుడు జ్ఞాపకానికి వస్తారు.. వృత్తి పరంగా వైద్యుడిగా ఆ విభాగంలో ప్రతిభ కనబరచడమే కాకుండా సంగీతంలోనూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఇంతటి మహనీయుడు శ్రీకాకుళం జిల్లా వారు కావడం గర్వకారణం. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం ప్రియాగ్రహారంలో శ్రీపాద కామేశ్వర రావు, జోగమ్మ దంపతులకు 1913 ఆగస్టు 3న జన్మించారు.పినాకపాణి 11వ ఏట వరకు ప్రియాగ్రహారంలో ప్రాథమిక విద్య, విజయనగరంలో ప్రాథమికోన్నత విద్యనభ్యసించారు. 1939లో ఆంధ్రా మెడికల్ (విశాఖ) కళాశాలలో ఎంబీబీఎస్, 1945లో జనరల్ మెడిసన్‌లో ఎండీ పూర్తి చేశారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, సూపరింటెండెంట్‌గా పని చేసి 1968లో ఉద్యోగ విరమణ పొంది... ఆ జిల్లాలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు వద్ద తొలి సంగీత పాఠాలు నేరుకున్న పినాకపాణి వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి వద్ద శిష్యరికం చేశారు. 1984లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 99వ జన్మదినం నాడు 'జ్ఞానవిద్యా వారధి' బిరుదుతో టీటీడీ సత్కరించింది. శ్రీపాద తనకు లభించిన స్వర్ణ పతకాలను కరిగించి భద్రాచలం సీతమ్మకు వడ్డాణం చేయించి సమర్పించారు. పాణినీయం, ప్రవృత్తి, స్వర రామమ్, అభ్యాసమ్, 'నా సంగీత యాత్ర' అనే రచనలు చేశారు. 2013 మార్చి 11న 99 ఏళ్ల వయసులో శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. డాక్టరూ, సంగీత జ్ఞాని అయిన కీర్తిశేషులు శ్రీపాద పినాకపాణి

గారు తృప్తిగా నిండు నూరేళ్ళు జీవించినట్టే భావించాలి. ఎందుకంటే వృత్తిలో తృప్తి లేనిదే పరుల బాగు కోసం వైద్యసేవ చేయడం కష్టం కనుక. ప్రవృత్తిగా సంగీత విద్య నభ్యసించి పదిమందికి నేర్పడంలోనూ ఎంతో తృప్తి ఉంది కనుక. రోగాలు మాపేవి రాగాలు అని ఆయన ద్వారా తెలుసుకున్న వారంతా ఎప్పుడో ఒకప్పుడు ఆయన్ని రెండు చేతులా నమస్కరించి తృప్తి పొందే ఉంటారు. తృప్తిగా బతక నిచ్చేది మంచి నీరు కాబట్టి ఆయన వల్ల బతికి బట్ట కట్టిన ఉత్తరాది వారొకాయన పినాకపాణి అంటే 'పీనేకా పానీ' అని తృప్తిగా చమత్కరించారు.

# శ్రీశైలంలో పర్యాటకుల సందడి

## ప్రాజెక్ట్ అందాలు వీక్షించేందుకు భారీగా రాక

## వాహనాలతో పదికిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

శ్రీశైలం,ఆగస్ట్3: శ్రీశైలం జలాశయం పదిగేట్లను ఎత్తడంతో ఆనకట్టకు సందర్శకుల తాకిడి పెరిగింది. వారంతం కావడంతో శనివారం తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఆనకట్ట వద్దకు చేరుకుని శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ పరవళ్లను చూస్తూ ఉత్సాహంగా గడిపారు. దీంతో జలాశయం పరిసర మార్గాల్లో వాహనాలు బారులు తీరాయి. తొలుత శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు, సందర్శకులు ఆ తర్వాత జలాశయం వద్దకు చేరుకుని కృష్ణమ్మ అందాలను వీక్షించారు. దీంతో ఆనకట్టకు ఇరువైపులా వాహనాలు భారీగా రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లింగాల గట్టు ప్రాంతంలో చేపల విక్రయాలు చేస్తుండటంతో ట్రాఫిక్ మరింతగా పెరిగింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేపలు పట్టడంపై నిషేధం ఉన్నా.. లింగాల గట్టు ప్రాంతంలో అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేపల విక్రయాలు నిషేధిస్తే ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం 10 క్రస్ట్ గేట్ల ద్వారా 4,64,740 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 62,668 క్యూసెక్కుల నీటిని అదనంగా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

# 6 నెలల్లో రూ. 670 కోట్లు



తిరుమల, ఆగస్టు 3, తిరుమలేశుడి ఆదాయం అంతకంతకు పెరుగుతోంది. ఈ ఏడాది మొదటి 6 నెలల్లో రూ. 670 కోట్లకు చేరిన తిరుమల వెంకన్న ఆదాయం జూలై నెలలో మరో రూ 125.35 కోట్లు జమైంది. ఈ మధ్యకాలంలో ఘననీయంగా పెరిగిన భక్తుల రద్దీకి తగ్గట్టుగానే హుండీ ఆదాయం కూడా రికార్డులు బద్దలు కొడుతోంది. వెంకన్నకు కానుకలు సమర్పించే భక్తకోటి తిరుమలేశుడి ఆస్తుల విలువను కూడా అమాంతంగా పెంచుతోంది. వెలకట్టలేని బంగారు ఆభరణాలు వెంకన్న సొంతం కాగా ఈ ఏడాది మొదటి 6 నెలల హుండీ ఆదాయం రూ. 670.21 కోట్లుగా శ్రీవారి ఖాతాకు జమైంది. జనవరిలో రూ 116.46 కోట్లు, ఫిబ్రవరిలో రూ 111.71 కోట్లు, మార్చి నెలలో రూ 118.49 కోట్లు, ఏప్రిల్ నెలలో రూ 101. 63 కోట్లు, మే నెలలో రూ 108.28 కోట్లు, జూన్ నెలలో రూ 113.64 కోట్లు హుండీ కానుకలుగా శ్రీవారి ఆదాయం ఖాతాకు చేరింది. ఇక జులై మాసంలో శ్రీవారికి మరో రూ.125.35 కోట్ల హుండీ ఆదాయం దక్కింది.ఈ ఏడాది ముగిసిన ఏడు మాసాల్లో అత్యధిక హుండీ ఆదాయం జులై మాసంలోనే లభించడం విశేషం. 2022 మార్చి నెల నుంచి వరుసగా గత 29 మాసాలుగా శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లకు పైగానే ఉంటోంది. కొన్ని మాసాల్లో రూ.125 కోట్లకు పైగా హుండీ ఆదాయం వచ్చింది. ఇప్పుడు జులై మాసంలోనూ హుండీ ఆదాయం రూ.125 కోట్లకు పైగా వచ్చింది.

2024లో నెల వారీగా హుండీ ఆదాయం వివరాలు..

జనవరి ? రూ. 116.46 కోట్లు
ఫిబ్రవరి ? రూ 111.71 కోట్లు
మార్చి ? రూ 118.49 కోట్లు
ఏప్రిల్ ? రూ 101. 63 కోట్లు
మే ? రూ 108.28 కోట్లు
జూన్ ? రూ 113.64 కోట్లు
జులై ? రూ.125.35 కోట్ల

గత జూలై నెలలో శ్రీవారిని 22.13 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. కోటి 4 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది టిటిడి. 24.04 లక్షల మంది భక్తులు జులై మాసంలో అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు టీటీడీ వెల్లడించింది. 8.67 లక్షల మంది భక్తులు తలనీలలు సమర్పించుకున్నారు.తిరుమల అన్నమయ్య భవన్ లో డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించిన టిటిడి ఇఓ శ్యామలరావు జూలై నెల వివరాలను ప్రకటించారు. తమిళనాడులోని తిరుత్తణిలో టీటీడీ భూమి అన్యాక్రాంతంపై చర్యలు తీసుకుంటామన్నారు శ్యామలరావు. అన్నప్రసాదంలో భక్తులకు రుచికరమైన ప్రసాదాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్నప్రసాదంలో యంత్రాలను త్వరలోనే మార్చుతున్నట్లు ప్రకటించిన ఈఓ శ్యామల రావు.. తిరుమలలో అత్యున్నత ప్రమాణాలతో ల్యాబ్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.దళారీలను అరికట్టడంలో భాగంగా పదే పదే టిక్కెట్లు పొందుతున్న 40వేల మంది ఐడిలను బ్లాక్ చేశామన్నారు. తిరుమలలోని హోటల్ నిర్వాహకులకు నిపుణుల చేత ట్రైనింగ్ ఇప్పిస్తామని తెలిపారు. అలాగే లడ్డూ తదితర ప్రసాదాల తయారీకి నాణ్యమైన నెయ్యిని వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ మేరకు నాణ్యమైన నెయ్యిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు టీటీడీ ఈవో శ్యామలరావు.

# పాఠశాలలో ఫుడ్ పాయిజన్

నంద్యాల,నంద్యాల శివారులోని వెంకటేశ్వర గ్రామం పరిధిలోని వైకాపా నాయకునికి చెందిన ఎస్. డి.ఆర్ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం కళాశాల చైర్మన్ కొండారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వేడుకలను నిర్వహించారు.శుక్రవారం ఆయన సతీమణి పుట్టినరోజు సందర్భంగా ఆహారం తిన్న విద్యార్థులు వందమందికి పైగా వాంతులు చేసుకున్నట్లు సమాచారం.విషయం బయటకు రాకుండా పాఠశాల యాజమాన్యం వైద్యులను పాఠశాలకే రప్పించి చికిత్స చేయిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు రావడంతో అదేం లేదంటూ స్కూల్ యాజమాన్యం బుకాయించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ న్యాయ శాఖ మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ విచారించాలని ఆదేశించగా ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి, డిప్యూటీ డిఈఓ మహబూబ్ బేగ్,మండల విద్యాధికారి బ్రహ్మం రాత్రి పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడి, జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు.వంద మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఈ అంశంపై పాఠశాల చైర్మన్ ను వివరణ కోరగా తన పాఠశాలలో అలాంటిది ఏమీ జరగలేదని డొంక తిరుగుడు మాటలు చెప్పడం దారుణం. డీఈఓ సుధాకర్ రెడ్డిని వివరణ కోరగా 80 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నట్లు తెలిసిందన్నారు.దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# శ్రీశైలం మల్లన్న హుండీ ఆదాయం రూ 3 కోట్ల 31 లక్షల 70 వేల 665 నగదు

శ్రీశైలం,నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న ఆలయంలో ఉభయ ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల ఉభయ ఆలయాలు,పరివార దేవాలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు చంద్రవతి కళ్యాణ మండపంలో పకడ్బందీగా ఈ లెక్కింపు నిర్వహించగా శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి 3 కోట్ల 31 లక్షల 70 వేల 665 రూపాయల నగదు రాబడిగా లభించిందని ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. ఈ ఆదాయాన్ని గత 29 రోజులులో శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తులు నగదును కానుకల రూపంలో సమర్పించినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు ఈహుండి లెక్కింపులో నగదుతో పాటు 127 గ్రాముల బంగారం అలానే వెండి 4 కేజీల 400 గ్రాములు లభించగా నగదు బంగారుతో పాటు 489 యుఎస్ఏ డాలర్లు,108 ఖత్తార్ రియాల్,1 మలేషియా రింగిట్స్,2 సింగపూర్ డాలర్లు, సౌదీ అరేబియా రియాల్స్ 15, థాయిలాండ్ బాట్స్ 90, యూరోలు 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 20 మొదలైన వివిధ దేశాల విదేశీ కరెన్సీ ఈ లెక్కింపులో లభించాయని ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు

# ఆంజనేయ, వెంకటేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు.

పూజలు నిర్వహిస్తున్న భక్తులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:- మండల కేంద్రంలో గల శ్రీ కాశీ విశ్వేశ్వర ఆంజనేయ స్వామి మరియు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్లకు ఆషాడ మాసంలో చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఇరువురు స్వాములకు ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మరియు అమ్మవార్లకు పూజారి దరూర్ నాగరాజ్ ఆచార్య పూజలు నిర్వహించి భక్తులకు అర్చన కార్యక్రమం నిర్వహించి. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ దేవాలయానికి మండల పరిధిలోని ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలి.

**డి ఎల్ డి ఓ. రికార్డులను తనిఖీ చేస్తున్న డి ఎల్ డి ఓ మురళి కళ్యాణి.**



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ రికార్డులలో అవకతవకలు లేకుండా చూడాలని డి ఎల్ డి ఓ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లావత్తుల, శ్రీరంగాపురం, కోటకొండ గ్రామాలలోని సచివాలయాలను డి ఎల్ డి ఓ మురళి కళ్యాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలన తప్పనిసరిగా పాటిస్తూ రికార్డులలో అవకతవకలు లేకుండా నిర్వహిస్తూ, పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆమె సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఒకవేళ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించక విధులకు సక్రమంగా హాజరు కాకపోతే అటువంటి వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాములేటి, కొండయ్య, షాహినూర్, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

# దేశభక్తి భావన ఉట్టిపడేలా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు, ఆగస్టు 03 :- దేశభక్తి భావన ఉట్టిపడేలా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మొక్కుబడిగా కాకుండా దేశ, రాష్ట్ర, జిల్లా సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దేశభక్తి భావన ఉట్టిపడే విధంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు...ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను వేడుకలకు ఆహ్వానించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు..సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లలు ఎండలో ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, 30 నుండి 45 నిమిషాలు మాత్రమే పెర్ఫార్మెన్స్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యాశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు..ప్రభుత్వ ఆశయాలు జిల్లా ప్రగతి లక్ష్యాలు,పురోగతి పై స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్లో వేదిక, జాతీయ జెండా ఏర్పాటు,మార్చ్ ఫాస్ట్, శానిటేషన్ , తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు..డ్వామా, హౌసింగ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్య, సర్వ శిక్ష అభియాన్, ఇరిగేషన్, అటవీశాఖ, సంక్షేమ శాఖలు ప్రగతి శకటాలను రూపొందించాలని, డిఆర్డిఏ, ఎస్సీ కార్పొరేషన్, హార్టికల్చర్, ఐసిడిఎస్ తదితర శాఖలు ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# తల్లిపాలే బిడ్డకు అమృతం బలమైనవి దృఢమైనవి : సూపర్వైజర్ కళావతి





శ్రీ ప్రస్థానం : పాణ్యంఇన్చార్జి: చెన్నయ్య పాణ్యం నియోజకవర్గం పరిధిలోని తిరుపాడు గ్రామంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా" 3 వ తేదీ శనివారము అంగనవాడి సూపర్వైజర్కళావతి మాట్లాడుతూ....... తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిది బలమైన దృఢమైనవి అని తెలిపారు. గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవా ర్యాలీ నిర్వహించి , గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలను తాగించాలి,బిడ్డ పుట్టిన మొదటి రోజు నుండి ఆరు నెలల వరకు సక్రమంగా తల్లిపాలు తాగించాలి, విధిగా పాటించాలని తెలిపారు, ఈ విధంగా త్రాగించడం వలన వ్యాధి నిరోధిక శక్తి ఎక్కువగా లభిస్తుంది, వాటి వలన 7 ప్రాణాంతక వ్యాధుల నుండి బిడ్డను కాపాడవచ్చు అన్నారు,బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లి బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు,ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కళావతి, అంగన్వాడి కార్యకర్తలు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు

# చాగలమర్రి ఘటనపై చలించిన సీఎం చంద్రబాబు



**తల్లిదండ్రులు, తోబుట్టువులను కోల్పోయి అనాథగా మిగిలిన బాలికకు రూ.10 లక్షల సాయం ప్రకటించిన చంద్రబాబు**

**బాలిక సంరక్షణ బాధ్యత తీసుకుంటామని సీఎం ప్రకటన**

**సీఎం చంద్రబాబు కు ధన్యవాదములు తెలిపిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్**

శ్రీ ప్రస్థానం – నంద్యాల, ఆగష్టు 3:- నంద్యాల జిల్లా, చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో గురువారం అర్ధరాత్రి సమయంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని అన్నారు. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబంపై అర్ధరాత్రి మట్టి మిద్దె కూలడంతో చిన్నవంగలి గ్రామానికి చెందిన తల్లపురెడ్డి గురుశేఖర్ తో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు చనిపోయారు. వర్షాలకు నాని మిద్దె కూలిపోయింది. దీంతో నిద్రలోనే గురుశేఖర్ రెడ్డి తో పాటు భార్య దస్తగిరమ్మ, కుమార్తెలు పవిత్ర, గురులక్ష్మి ప్రాణాలు కోల్పోయారు. రెండో కుమార్తె తల్లపురెడ్డి గురు ప్రసన్న (15) ప్రొద్దుటూరులో 10వ తరగతి చదువుకుంటోంది. రాత్రికి రాత్రి కుటుంబంలో తల్లిదండ్రులతో సహా తోబుట్టువులు చనిపోవడంతో ప్రసన్న అనాథ అయ్యింది. ఈ ఘటనపై సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి ప్రసన్నకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరుపున రూ.10 లక్షల సాయం ప్రకటించారు. ప్రస్తుతం ప్రసన్న తన నాయనమ్మ తల్లపురెడ్డి నాగమ్మ (70) సంరక్షణలో ఉందని అధికారులు వివరించారు. ప్రసన్న పేరుతో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడంతో పాటు.... వృద్ధురాలైన నాగమ్మకు కూడా రూ.2 లక్ష సాయం అందించాలని సీఎం అధికారులను అదేశించారు. జిల్లా అధికారులు ఆ బాలికను కలిసి ధైర్యం చెప్పాలని సూచించారు. చిన్న వయసులో తల్లిదండ్రులను, తోబుట్టువులను కోల్పోయిన ఆ బాలికకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మరోవైపు పార్టీ పరంగా కూడా ప్రసన్నకు బాసటగా నిలుస్తామని సీఎం అన్నారు. బాలిక సంరక్షణ, విద్య విషయంలో పార్టీ నుంచి కూడా అండగా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.భాదితులకు అండగా సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ధన్యవాదములు తెలిపారు. ప్రభుత్వ సహాయంతో పాటు భాధిత ప్రసన్న భవిష్యత్ లో ఉన్నత చదువులకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాధిత ప్రసన్న తన పూర్తి సహకారం ఉంటుందని మంత్రి ఫరూక్ చెప్పారు.

# శ్రావణమాసోత్సవాల ఏర్పాట్లు



**ఆగస్టు 5 నుంచి శ్రావణమాసోత్సవాలు**

శ్రీశైలం ఆగస్టు 03: శ్రావణమాసోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లుభక్తులకు వసతి, దర్శనం ఏర్పాట్లు, అన్నప్రసాదవితరణ, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధఆగస్టు 15 నుంచి 19 వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం నిలుపుదల, కేవలం అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం.శ్రావణమాస రద్దీరోజులలో ఆర్జిత అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు నిలుపుదలశ్రావణమాసంలో రెండవ మరియు నాల్గవ శుక్రవారాలలో ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలులోకకల్యాణం కోసం శ్రావణమాసమంతా అఖండ శివనామ భజనలుకార్యనిర్వహణాధికారి శ్రీ డి. పెద్దిరాజుఆగస్టు 5వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ ఉదయం వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి.ఈ ఉత్సవ నిర్వహణకుగాను దేవస్థానం పలు ఏర్పాట్లను చేయడం జరిగింది.ఏర్పాట్లకు సంబంధించి కార్యనిర్వహణాధికారి శ్రీ డి. పెద్దిరాజు గత నెల 8వ తేదీన ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయా విభాగాల ద్వారా చేపట్టాల్సిన ఏర్పాట్లకు సంబంధించి కార్యనిర్వహణాధికారివారు పలు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. తదుపరి గత నెల 28వ తేదీన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయా ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారివారు సమీక్షించారు.శ్రావణమాసంలో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచేకాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి మరియు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో క్షేత్రాన్ని సందర్శిస్తారు. ఈ కారణంగా ఆర్జిత అభిషేకాలు, దర్శనాలలో కొన్ని మార్పులు చేయబడ్డాయి.ఆగస్టు 15 నుండి 19 వరకు అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం :× శ్రావణమాసంలో అయిదు రోజులపాటు అనగా ఆగస్టు 15 నుంచి 19 వరకు అనగా అయిదు రోజులపాటు భక్తులకు శ్రీస్వామివారి అలంకారదర్శనం మాత్రమే కల్పించబడుతుంది. ఈ అయిదు రోజులలో శ్రీస్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం ఉండదు. ఏకాదశి, వరలక్ష్మీ వ్రతం, శ్రావణపౌర్ణమి మొదలైన పర్వదినాల కారణంగా ఈ రోజులలో భక్తులు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తారు.రద్దీ రోజులలో ఆర్ధిత అభిషేకాలు- ఆర్జిత కుంకుమార్చనలు నిలుపుదలభక్తుల రద్దీ కారణంగా శ్రావణశనివారాలు, శ్రావణ ఆదివారాలు, శ్రావణసోమవారాలు, స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మీవ్రతం, శ్రావణపౌర్ణమి మొదలైన రోజులలో (మొత్తం 16 రోజులపాటు) గర్భాలయ అభిషేకాలు మరియు సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు, ఉదయాస్తమాచసేవ. పాతకాలసేవ, ప్రదోషకాల సేవ పూర్తిగా నిలుపుదల చేయబడ్డాయి.అభిషేకాలు నిలుపుదల చేసిన ఈ నిర్దిష్టరోజులలో (15.08.2024 నుంచి 19.08.2024 వరకు అనగా అయిదురోజులు మినహా) రోజుకు నాలుగు విడుతలుగా స్వామివార్ల స్పర్శ దర్శనం కల్పించబడుతుంది.ఈ స్పర్శదర్శన టికెట్లను (రూ. 600/-లు రుసుము ప్రస్తుతం అమలులో ఉన్నట్లుగానే దేవస్థానం వెబ్ సైట్ లిలిజీజీతీజీజీశ్రీజీటవలజీబబిష్ట్రజీనిజీఎబనీనిణ' ద్వారా ముందస్తుగా పొందవచ్చు.రద్దీ సాధారణంగా ఉండే రోజులలో యధావిధిగా ఆర్జిత అభిషేకాలు కుంకుమార్చనలురద్దీ సాధారణంగా ఉండే మిగతా రోజులలో శ్రావణమాసంలోని మొత్తం 14 రోజులు) గర్భాలయ ఆర్ధిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, కుంకుమార్చనలు యధావిధిగా కొనసాగుతాయి.భక్తులు వివిధ ఆర్జితసేవాటికెట్లను ఆన్లైన్ ద్వారానే పొందవలసివుంటుంది. ఈటికెట్లను కూడాలభ్యతను బట్టి గంట ముందు వరకు కూడా భక్తులు పొందవచ్చు.ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలు:ప్రస్తుతం అమలులో ఉన్నట్లుగానే శ్రావణమాసమంతా కూడా భక్తులకు ఉచిత, శీఘ్ర, అతికిస్ట దర్శనాలు ఏర్పాట్లు చేయబడ్డాయి.శీఘ్రదర్శనం టికెట్టు రుసుము 150/-లు) మరియు అతిశీఘ్రదర్శనం టిక్కెటు రుసుము 300/-లు) టికెట్లను ఆన్లైన్తో పాటు కరెంట్ బుకింగు ద్వారా కూడా పొందవచ్చు.ఆలయ వేళలుప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే ప్రతీరోజు వేరువజామున గం.3,00లకే ఆలయద్వారాలు తెరచి మంగళ వాయిద్యాలు, సుప్రభాతసేవ, ప్రాతకాలపూజలు జరిపించబడుతాయి.ఉభయదేవాలయాలలో గం.4.30 నుంచి మహామంగళహారతులు ప్రారంభించి బడుతాయి.మహామంగళహారతుల ప్రారంభం నుంచే అనగా గం.4.30లకే భక్తులనుదర్శనాలకు అనుమతించ డంసాయంత్రం గం. 400ల వరకు సర్వదర్శనం కొనసాగించబడుతుంది.

# తగిన మోతాదులో ఎరువులు వాడాలి.

**"నవభారత్" ఫర్టి లైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్, కె.సుదర్శనాచారి.**



దొర్నిపాడు,ఆగస్టు:03, శ్రీ ప్రస్థానం న్యూస్:- పంటసాగులో తగిన మోతాదులో ఎరువులు వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో పాటు అధిక లాభాలు రాబట్ట వచ్చునని " నవభారత్" ప ర్టిలైజర్స్ ఫిల్డ్ ఆఫీసర్ .కె.సుదర్శనాచారి రైతులకు సూచించారు..శనివారము కోవెల కుంట్ల, దొర్ని పాడు మండల పరిధిలోని భీముని పాడు, కొండా పురం గ్రామాల్లోని రైతులతో సేంద్రియ, మరియు జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి అవగాహన కల్పించారు.. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు లో రసాయన ఎరువులు అధికంగా వాడకం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయి. రసాయన ఎరువుల వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి, పంట దిగుబడులు తగ్గిపోతాయి మానవ, జంతు వాళికీ ముప్పు కలిగిస్తాయి. పర్యవరణ కాలష్యన్ని పెంచుతాయన్నారు.. కావున సేంద్రిమి, జీవన ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించ డమే కాకుండా అధిక దిగుబడులను పొందవచ్చున్నారు. "నవ భారత్ ఫర్టిలైజర్స్" వారు రైతులకు అందించే సేంద్రియ ఎరువులతో అధిక పూత మరియు దిగుబడులను అందిస్తాయన్నారు.. అలాగే జీవన ఎరువులు వాడటం ద్వారా పంటకు భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సుక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి ఎరోధిక శక్తిని పెంచుతాయని పలు అంశాలపై రైతులకు అవగాహణ కల్పించారు.. "నవ భారత్ ఫర్టిలైజర్స్" సంస్థ గత 20 సంవత్సరాల నుండి సేంద్రమ, జీవన ఎరువును అందిస్తోంది అన్నారు. పలు గ్రామాల్లో సేంద్రియ, జీవన ఎరువులు" రైతు అవగాహన సదస్సు!! కార్యక్రమలు నిర్వహిస్తున్నాం అని వివరించారు .ఈ కార్యక్రమంలో కంపేనీ ప్రతినిధులు అయిన కె.సుదర్శనాచారి జే.అర్.ఎం.డి ఈ. రవీంద్రశెట్టి,. ఆర్ ఎస్.ఎం. క్రిష్ణ మూర్తి , శ్రీ ఎం డి ఈ.సురేష్, డీ వై ఎస్ ఎమ్, గ్రామ రైతులు పాల్గొనారు. సేల్స్ విభాగములో శిక్షణ ఇచి ఉద్యోగఅవకాశాలు కల్పిస్తామన్నారు .సంప్రందించాల్సిన నెంబర్ :8555825374,ఈమెయిల్ gamil sudarshanachari@gmail.com

# అధ్యక్ష అభ్యర్థుల మధ్య చర్చ

**కమలతో చర్చకు సిద్దమన్న ట్రంప్**



వాషింగ్టన్,ఆగస్ట3:అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీ తరపున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమెతో ముఖాముఖి చర్చ జరిపేందుకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఫాక్స్‌న్యూస్ ఆఫర్‌ను ఆయన అంగీకరించారు. ఈవిషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో తాజాగా వెల్లడించారు. వచ్చే నెలలో వీరి మధ్య డిబేట్ జరగనుంది. సెప్టెంబరు 4న ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈవెంట్‌లో కమలా హారిస్ తో డిబేట్ జరిపేందుకు అంగీకరించా. వాస్తవానికి ఇదే తేదీన ఏబీసీ ఛానల్‌లో జో బైడెన్‌తో నేను ముఖాముఖి చర్చలో పాల్గొనాల్సింది. అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలగడంతో ఆ డిబేట్ రద్దయ్యింది. ఫాక్స్‌న్యూస్ డిబేట్ పెన్సిల్వేనియాలో జరుగుతుంది. బైడెన్‌తో జరిగిన చర్చలోని రూల్స్ అన్నీ దీనికి వర్తిస్తాయి. కానీ ఈసారి పూర్తిస్థాయిలో ప్రేక్షకులు కూడా ఉంటారని ట్రంప్ వెల్లడించారు. అయితే.. ఈ డిబేట్, దాని కండీషన్స్‌కు హారిస్ అంగీకరించారా? లేదా అన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు. ట్రంప్‌తో చర్చ గురించి ఆమె ప్రతినిధులు ఇంకా స్పందించలేదు. అయితే, ఆయనతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని గతంలో కమలా హారిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికి ఆమె అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో ట్రంప్ దానిపై స్పందించలేదు. తాజాగా హారిస్ పోటీ ఖాయమవడంతో డిబేట్‌కు అంగీకరిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు.

# ఈనెల 05 వ తేదీ ( సోమవారం) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం...

**జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా**

కర్నూలు, ఆగస్టు 03 :- ఈనెల 05 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారుజిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757